
చీపురుపట్టి శుభ్రం చేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పోలీసుకార్యాలయ ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో కలిసి చెత్తాచెదారాన్ని ఊడ్చి, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లలో అధికారులు సిబ్బంది తమ కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివనారాయణ స్వామి, హేమంత్‌కుమార్, శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, మహేష్‌లు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలే శ్రీరామరక్ష

బాణసంచాతో బహుపరాక్.. పండుగవేళ ఆదమరిస్తే ప్రమాదాలే..!

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి అంటే గుర్తొచ్చేది వెలుగుల దివ్వెలు, బాణసంచా మోతలు, మిరిమిట్లు గొలిపే కాంతులు. ఈ పండుగ పిల్లలు, పెద్దలకు ఎనలేని ఆనందాన్ని పంచుతుంది. అయితే పండుగ వెలుగుల మాటున ఆదమరిస్తే పెనుప్రమాదాలు కూడా పొంచిఉంటాయి. అందుకే వెలుగు పండుగను తగు జాగ్రత్తలతో ఆనందంగా జరుపుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలో బాణ సంచా విక్రయానికి 376 దుకాణాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. దీంతో శనివారం సాయంత్రం నుంచి జిల్లాలో బాణ సంచా విక్రయ దుకాణాలు వెలిశాయి. కొనుగోళ్లు కూడా ప్రారంభం అయ్యాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పాలిస్టర్ కాకుండా కాటన్ దుస్తులు ధరించాలి. కాళ్లకు బూట్లు లేదా చెప్పులు, కళ్లకు అద్దాలు ధరించి తగుదూరం నుంచి టపాసులు కాల్చాలి. రద్దీ ప్రదేశాలు, వాహనాలు వెళ్లేటప్పుడు, జనం గుంపులుగా ఉన్నచోట్ల టపాసులు కాల్చరాదు. పెద్దలు పక్కన లేకుండా ఎట్టి పరిస్థితుల్లో చిన్న పిల్లలతో టపాసులు కాల్చనివ్వరాదు. ఇళ్లల్లో, బాల్కనీల్లో టపాసులు కాల్చరాదు. చేతుల్లో టపాసులు వెలిగించి విసరడం చాలా ప్రమాదకరం. టపాసులు, చిచ్చుబుడ్డీలు, భూచక్రాలు, లైట్ ఒత్తులు వెలిగించిన తర్వాత పూర్తిగా ఆరిపోయే వరకు దగ్గరికి వెళ్లకూడదు. తారాజువ్వలు, రాకెట్లు, భారీ టపాసులను నిర్మానుష్య ప్రాంతాల్లో మాత్రమే కాల్చాలి. బాంబులు వెలిగించి వాటిపై పాత్రలు, అట్టపెట్టెలు బోర్లించరాదు. టపాసులు కాల్చే సమయంలో మద్యం సేవించకూడదు. మొబైల్ ఫోన్లు దూరంగా ఉంచాలి. బాణసంచా కాల్చే సమయంలో చుట్టు పక్కల అందుబాటులో నీళ్లు, ఇసుక ఉంచుకోవాలి. దీంతో అనుకోని ప్రమాదం జరిగితే వెంటనే నియంత్రించే అవకాశం ఉంటుంది.


కదిరిలో వెలిసిన దుకాణాలు

అనుకోని ప్రమాదం జరిగి చిన్న గాయమైతే వెంటనే మంచినీటితో కడగాలి. పెద్దగాయమైతే సమీపంలోని అసుపత్రికి తీసుకెళ్లాలి. మంటలు అంటుకుంటే నీటిలో తడిపిన దుప్పటితో ఆర్పివేయాలి.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



దీపావళి పండుగ సందర్భంగా టపాసులు వెలిగించే సమయంలో ప్రజలు, పిల్లలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. బాణసంచా విక్రయ లైసెన్సులు పొందిన వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. దుకాణాల వద్ద నీళ్లు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి. ఎక్కువ దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఫైరింజన్లు అందుబాటులో ఉంచుతాం. అన్ని బాణసంచా దుకాణాల వద్ద నిత్యపర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను నియమించాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

\- మాధవనాయుడు, అగ్నిమాపక శాఖ అధికారి

భారత్ విజయాన్ని ఆపలేరు

● మంత్రి సత్యకుమార్‌యాదవ్


ఎంపికైన విద్యార్థినులను సన్మానించిన బీజేపీ నేత హరీశ్‌బాబు

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి, యువశక్తి కలిసినప్పుడు భారత్ విజయాన్ని ఎవరూ ఆపలేరని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సింగపూర్‌లో వచ్చేనెలలో నిర్వహించే అంతర్జాతీయ ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికైన పదిమంది బీఎస్ఆర్ బాలికల మున్సిపల్ ఉన్నతపాఠశాల విద్యార్థినులకు సన్మాన కార్యక్రమం శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. విద్యార్థుల క్రీడా ప్రతిభ గురించి మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ఫోన్‌లో వివరించారు. దీనిపై మంత్రి ఫోన్‌లోనే హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల సింగపూర్ ప్రయాణ ఖర్చుల కోసం రూ.5 లక్షల సాయం కూడా ప్రకటించారు. భవిష్యత్తులో బాలికలు మరిన్ని అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రతిభను చాటాలని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అభిలషించారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ హెచ్ఎం దేవిప్రకాశ్, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● కలెక్టర్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి


మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నల్లమాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్లమాడ మండలంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొదట అరవవాండ్లపల్లి సమీపాన ఉన్న మార్కెట్‌యార్డ్ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం నల్లమాడలోని కస్తూర్బా పాఠశాలను పరిశీలించారు. కలెక్టర్, ఎమ్మెల్యే వేర్వేరుగా 9వ తరగతి, ఇంటర్ విద్యార్థినులకు కాసేపు పాఠాలు బోధించారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలోనే విద్యార్థులతో సహబంతి భోజనం చేశారు. పదో తరగతి విద్యార్థినుల మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్యార్థినులకు కంప్యూటర్ విద్య గురించి వివరించారు. పాఠశాల స్థితిగతులు, విద్యార్థినుల చదువుల పట్ల కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం నల్లమాడ జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూర్యఘర్ సోలార్ పవర్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లుల బాధ తప్పుతుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. చౌటకుంటపల్లి గ్రామ రైతు పద్మనాభరెడ్డి పొలంలో పండ్ల మొక్కలను నాటారు. బాసంవారిపల్లిలో ఇంటిం టా మొక్కలునాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఈఓ క్రిష్టప్ప, జీసీడీఓ సంపూర్ణ, ఎంపీడీఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ మనోజ్‌కుమార్‌రెడ్డి, నల్లమాడ సర్పంచ్ రమావత్ భారతి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వల్లెపు శ్రీనివాసులు, సింగిల్ విండో అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి, టీడీపీ నాయకు లు మైలే శివశంకర్, కోట్లో మంజునాథరెడ్డి, బుట్టి నాగభూషణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై ఉక్కుపాదం

● ఎస్పీ సతీష్‌కుమార్

● వేర్వేరుచోట్ల రూ. 19.39 లక్షల సొత్తు స్వాధీనం

9

న్యూస్ బాక్స్

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న దాతలు

అమడగూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేట సమీపంలోని తుమ్మల కొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రాంతంలోని చాలా మంది భక్తులు తిరుమలకు వెళ్లలేని పరిస్థితుల్లో తుమ్మల కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామిని దర్శించి మొక్కులు చెల్లిస్తారని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం పలువురు భక్తులు నాలుగా వారాల పాటు ప్రతి శనివారం ఉపవాసాలు ఉండి స్వామికి పూజలు చేయించారని తెలిపారు. దాతల సహకారంతో అన్నప్రసాద వితరణచేశారు. ఆలయ కమిటీ సభ్యులు గోపిశెట్టి శ్రీనివాసులు, బిల్లూరు మహేశ్వర్‌రెడ్డి, రామినేని రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి

● జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బషీర్

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించి, ప్రతి అంశాన్ని పరిశీలనాత్మకంగా, హేతుబద్ధంగా చూడాలని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బషీర్ పేర్కొన్నారు. స్థానిక గణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం లక్ష్మయ్య అధ్యక్షతన చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బషీర్ మాట్లాడారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేశ్, ఉపాధ్యాయులు హరిక్రిష్ణ, రామకృష్ణ, హనుమంతు, రామ్మోహన్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సభావేదిక నిర్మాణానికి భూమిపూజ

కొత్తచెరువు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో సభా వేదిక నిర్మాణానికి శనివారం విశ్రాంత హెచ్‌ఎం నరసప్ప కుమారుడు వెంకట నరసయ్య చేతులమీదుగా భూమి పూజ చేశారు. ఎన్‌సీ నరసప్ప జిల్లా పరిషత్ పాఠశాలకు దీర్ఘకాలికంగా హెచ్‌ఎంగా పనిచేశారని, ఆయన జ్ఞాప కార్థం వారి కుమారులు రూ.10లక్షలతో సభావేదిక నిర్మాణానికి శ్రీకారంచుట్టారని పాఠశాల హెచ్‌ఎం గోపాల్, విశ్రాంత హెచ్‌ఎం వెంగన్న తెలిపారు. శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంబించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

దారి మూసేస్తున్నారని ఫిర్యాదు

కొత్తచెరువు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక వేణుగోపాల్‌నగర్ కాలనీలో కొందరు వ్యక్తులు తమ ఇళ్లకు వెళ్లే దారిని మూసేస్తున్నారంటూ తహసీల్దార్ బాలాంజనేయులుకు శనివారం ఆ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...2014లో సర్వే నెంబరు 478-1లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లపట్టాలను పంపిణీచేశారన్నారు. అందులో కొంతమంది బయటి వ్యక్తులు ఇళ్లపట్టాలను కొనుగోలు చేసి ఇళ్లకు వెళ్లే దారిని సైతం లేకుండా చేస్తున్నారన్నారు. కాలనీవాసులు అనిల్, సల్లప్ప, అరుణ్, శీనప్ప, అక్కులప్ప తదితరులు ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కదిరి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కదిరి మండలంలోని ఓ గ్రామంలో 35 ఏళ్ల వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు కదిరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. అతడు శనివారం బాలికకు మాయ మాటలు చెప్పి, అతడి ఇంట్లోకి తీసుకెళ్లి ఈ దారుణానికి ఒడికట్టాడని తెలిపారు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందుతుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

25వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన



మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్, టీడీపీ నాయకులు

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ శనివారం పట్టణంలోని 25వ వార్డులో ఉన్న హమాలీ కాలనీలో పర్యటించారు. కాలనీలోని మురుగు కాలువకు అడ్డంగా కొందరు ఇళ్ల పునాదులు నిర్మించడంతో మురుగునీరు ముందుకు వెళ్లలేక ఇళ్లలోకి వెళుతోంది. అలాగే ఇళ్ల ఎదుట నిల్ల ఉంటోంది. ఇక వర్షం వస్తే వర్షపునీరు ము రుగునీటితో కలిసి వారి పరిస్థితి దుర్భరం. అలాగే ఆ నీరు రోడ్లపై ప్రవహించి, వీధుల్లో ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సమస్యను ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో శనివారం మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ, టౌన్‌ప్లానింగ్ అధికారి అలివేలమ్మ, డీఈ వీరేశ్ పరిశీలించారు.

బస్సు జాతాను విజయవంతం చేయండి

కదిరి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు తలపెట్టిన బస్సు జాతాను విజయవం తం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో బస్సు జాతాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శేషం మహేంద్ర, పవన్, గణేష్, శ్రీనివాసులు, సురేంద్ర, చరణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు గాయాలు

బత్తలపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గంటాపురం గ్రామంలో శనివారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి శివమ్మ అనే మహిళ గాయపడింది. గ్రామానికి చెందిన పెద్దన్న భార్య శివమ్మ తమ రేకుల షెడ్డులో శనివారం రాత్రి వంట చేసేందుకు చిన్న సిలిండర్ గ్యాస్ స్టవ్‌ను వెలిగించేందుకు ప్రత్నించింది. ఒక్క సారిగా సిలిండర్ పేలి, ఆమెకు మంటలు వ్యాపించాయి గమనించిన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి బత్తలపల్లి గాయపడిన ఆమెను ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు వీరనారప్ప ఆసుపత్రికి వెళ్లి శివమ్మను పరామర్శించారు.

ఉచితంగా సైకిళ్ల పంపిణీ

బుక్కపట్నం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దరాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివే చెన్నరాయునిపల్లి, కొట్టాలపల్లికి చెందిన 18 మంది విద్యార్థులకు సాయి భక్తుల సహకారంతో ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశారు. ఎనుముల పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సి. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సుందరవల్లి మేడం, దాతల సహకారంతో గతంలోనూ విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీకాంత్, సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త డంపింగ్

కదిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో పేరుకుపోయిన చెత్త కంపుకొడుతోంది. గ్రామం నుంచి వచ్చే మొత్తం చెత్తను కుటాగుళ్లలోని కదిరి- పులివెందుల రహదారిలో పవర్ ఆఫీస్ వెనక పారబోస్తున్నారు. కుళ్లిన ఈ చెత్త అటువైపుగా వెళితే కంపుకొడుతోంది. రోడ్డు పక్కనే చెత్తనంతా వేసి డంపింగ్ యార్డ్‌గా తయారు చేశారని పలువురు విమర్శిస్తున్నారు. మునిసిపాలిటీలో మూడు వార్డులు ఉన్న పెద్ద శివారు ప్రాంతం కుటాగుళ్ల. ఇక్కడ డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే మునిసి పాలిటీ అధికారులు ఆ రకంగా ఆలోచించడమే మానేశారు. అంతేగాకుండా మునిసిపల్ అధికారులు కుటాగుళ్ల ప్రజల నుంచి ఇంటిపన్నుతో పాటు కొళాయి పన్ను కూడా ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కానీ ఆ గ్రామ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో 10వేల వరకు జనాభా ఉంది. ఇంత పెద్ద గ్రామానికి మునిసిపల్ కార్మికులు కూడా అరకొరగానే ఉన్నారు. మునిసిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికీ పల్లె కంటే అధ్వానంగా ఇక్కడ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి పవర్ ఆఫీస్ వెనుక ఉన్న డంపింగ్‌యార్డ్‌ను తొలగించాలని, ప్రత్యేకంగా కంపోస్ట్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో తాగునీరు, వీధి లైట్‌లు, మురుగునీటి కాలువలను సక్రమంగా నిర్వహించాలని వారు కోరుతున్నారు.



పవర్ ఆఫీస్ వెనుక నిల్వ ఉన్న చెత్త

సూర్యఘర్‌తో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్

● ఎమ్మెల్యే సింధూరరెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్
● సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



హారతిఘాట్ వద్ద కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్/టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ ఏర్పాటుతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్‌కూడలిలో శనివారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి నాగరాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వలన సగటున మనిషికి రూ. 20వేల నుంచి రూ. 40వేల వరకు లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు. అదేవిదంగా ప్రధానమంత్రి సూర్యఘర్ సోలార్ యూనిట్ ఏర్పాటుచేసుకుంటే విద్యుత్‌బిల్లుల ఆదా అవుతుందన్నారు. సూర్యఘర్ పథకానికి నియోజకవర్గాన్ని ఒక మోడల్‌గా తీసుకుని సమారు పదివేల సోలార్ యూనిట్లు ఏర్పాటుచేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనంతరం హారతి ఘాట్‌వద్ద సూపర్‌జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌లపై ప్రజలకు కలెక్టర్ శ్యాంప్రసాద్ అవగాహన కల్పించారు. అంతకు మునుపు జీఎస్టీ తగ్గింపు వలన వస్తువుల రాయితీ, తదితర వాటిపై ఏర్పాటుచేసిన ఎగ్జిబి షన్‌ను ఎమ్మెల్యే, మాజీమంత్రి ఎస్ఈ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఈఈ శివరాముడు, ఆర్డీఓ సువర్ణ, మునిసిపల్ కమిషనర్ క్రాంతికుమార్, తహసీల్దార్ కళ్యాణ్ పరిశీలించారు.దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. సదస్సులో టీడీపీ జిల్లా_కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, ముమ్మనేని వెంకటరాముడు, నాయకులు గంగాధర్‌నాయుడు, సుబ్బచంద్ర, ఓడీసీ మండలకన్వీనర్ జయచంద్ర, మహమ్మద్‌రఫీ, కృష్ణప్రసాద్, కొత్తచెరువు మార్కెట్ యార్డు చైర్మన్ పూలశివప్రసాద్, చంద్రశేఖర్, కొత్తపల్లి జయప్రకాష్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు మేలు: ఆర్డీఓ



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగిందని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. విద్యుత్ శాఖ కదిరి డివిజన్ ఆధ్వర్యంలో శనివారం జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... జీఎస్టీ 2.0తో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందు కు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో ప్రచారం చేయాల్సిన ఎంతైనా ఉందన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయం నుంచి కాలేజీ సర్కిల్ మీదుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ పోలప్ప, విద్యుత్ శాఖ ఈఈ శ్రీకృష్ణదేవ, ఏడీలు వరప్రసాద్ రెడ్డి, ఓబలేశు, ఏఈలు చెన్నకృష్ణ, శ్రీనివాస నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటను దున్నేశారని పోలీసులకు ఫిర్యాదు

నల్లమాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తమ పొలంలో సాగుచేసిన ఉలవ పంటను దున్నేశారని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని మూలపల్లగారిపల్లికి చెందిన చంద్రశేఖర్ తెలిపారు. ఆ రైతు శనివారం మాట్లాడుతూ... తనకు కురుమాల గ్రామ పొలంలో 3.80 ఎకరాల పొలం ఉండగా అందులో ఉలవ పంట సాగు చేశానన్నాడు. పంట కూడా బాగుందన్నాడు. అయితే శనివారం ఉదయం 8 గంటలకు ఆ పొలం వద్దకు వెళ్ళి చూడగా పంటను మొత్తం ఎవరో దున్నేసినట్లు కనిపించిందన్నారు. తాను చుట్టుప్రక్కల వారిని విచారించగా తమ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పంట దున్నేశారని తెలిసిందన్నాడు. దీనిపై నల్లమాడ పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

పాఠశాలలో దీపావళి



కాకతీయ విద్యానికేతన్‌లో వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శనివారం దీపావళి వేడుకలను కన్నులపండవగా జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగులరంగుల ముగ్గులతో పాఠశాలను అలంకరించారు. పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ వ్యవస్థలకే కేంద్రం మద్దతు'

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వ్యవస్థలకే కేంద్ర ప్రభుత్వం మద్దతు నిస్తోందని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న విమర్శించారు. పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో ఆయన శనివారం సమావేశాన్ని నిర్వహించారు. రైతుసంఘం మండల కమిటీని ఎంపికచేశారు. అధ్యక్షుడిగా రేగాటిపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి మారుతి, సహాయ కార్యదర్శి తుంపర్తి చెన్నారెడ్డి, కోశాధికారిగా రేగాటిపల్లి రవితో పాటు సభ్యులను ఎంపికచేశారు. సీపీఎం నాయకులు ఎస్‌హెచ్‌బాషా పాల్గొన్నారు.

వరి కోతకొచ్చింది.. చెరువుకు నీరు ఇవ్వొద్దు

● ఎమ్మెల్యే సింధూరా రెడ్డికి రైతుల విన్నపం

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం చెరువు కింద ఆయకట్టుఓ వరిపంట కోతకొచ్చిందని, కొద్దిరోజులపాటు చెరువుకు హంద్రీనీవా నీటిని విడుదలను ఆపాలని పెద్దకమ్మవారిపల్లి, జానకంపల్లికి చెందిన రైతులు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి విన్నవించా రు. జిల్లాకేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్ అవగాహన సదస్సుకు వచ్చిన ఎమ్మెల్యేను ఆ రెండు గ్రామాల రైతులు కలసి వినతి పత్రం అందజేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా బుక్కపట్నం చెరువుకు నీరువిడుదల చేయనున్నట్లు తెలిసిందన్నారు. నీరు విడుదల చేస్తే రెండుగ్రామాలకు చెందిన సుమారు 200 వందల ఎకరాల్లో కోతకు వచ్చిన వరిపంట ముంపునకు గురవుతుందని తెలిపారు. రైతులు దారపనేని చంద్రశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని సమస్యలకు త్వరలో పరిష్కారం

● న్యాయవాదులు సహకరించాలి: జిల్లా ప్రధాన న్యాయాధికారి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు

కదిరి లీగల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కోర్టులలో నెలకొన్న సమస్యలు, న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్నీ పరిశీలనలో ఉన్నాయని, త్వరలోనే పరిష్కార మార్గం వస్తుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు అన్నారు. న్యాయా ధికారి శనివారం కదిరిలోని కోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక న్యాయాధికారులు ఎస్ జయలక్ష్మి, పి. లోకనాథం, న్యాయవాదులు తదితరులు ప్రధాన న్యాయాధికారికి స్వాగతం పలికారు. కోర్టు ఆవరణలోనే పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం న్యాయవాదుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆదనపు కోర్టుల అవసరాన్ని ప్రధాన న్యాయాధికారి దృష్టికి తెచ్చారు. దీనిపై ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ... ఇప్పటికే అనేక విజ్ఞప్తులు ఉన్నాయని ఆదనంగా కోర్టుల ఏర్పాటును త్వరలోనే చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆనవాయితీ ప్రకారం న్యాయాధికారిని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాన్ని బహుకరించారు. ప్రధాన న్యాయాధికారి వెంట స్థానిక న్యాయాధికారులు ఎస్ జయలక్ష్మి, పి లోకనాథం ఉన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రబాబు, లోకేశ్వర్‌రెడ్డిడ, సుబ్బరాజుగుప్తా, తదితరులు పాల్గొన్నారు. జిల్లా న్యాయాధికారిని ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు.

నిబంధనల మేరకే విక్రయించాలి: ఎస్పీ



పుట్టపర్తి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకే టపాసులు విక్రయించాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ హెచ్చరించారు. పోలీసుకార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ టపాసుల దుకాణాల్లో పూర్తి భద్రతాప్రమాణాలు పాటించాలన్నారు. నీరు, ఇసుక అగ్ని మాపక సామగ్రి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కేటాయించిన ప్రదేశాల్లో లైసెన్సు కలిగిన వారు మాత్రమే టపాసులు క్రయవిక్రయాలు చేయాలని ఆదేశించారు. అక్రమంగా టపాసుల నిల్వ ఉంచడం, తయారు చేయడం వంటివి చేయరాదన్నారు. దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. అక్రమ టపాసుల విక్రయాలు, ప్రమాదాలపై సమాచారం కోసం డయల్ 112 లేదా 100కు ఫోన్ చేయాలన్నారు.

'మొక్కలు నాటి సంరక్షించాలి'



ఈతోడులో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని బాధ్యతగా సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 25వ వార్డులోని వాల్మీకి సర్కిల్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు మాట్లాడారు. టౌన్‌ప్లానింగ్ అధికారి అలివేలమ్మ, డీఈ వీరేశ్, టీడీపీ నాయకులు చీమల రామాం జి, చీమల సూరి, క్లస్టర్ రామాంజి, గడ్డం సూరి, అంకన్న, భీమా, రవి, పెద్ద నరసింహులు, జనసేన నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్ పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యమైన జీవనం అని సీహెచ్‌ఓ ప్రమీళ పేర్కొన్నారు. మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైద్యశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు గోపాల్‌నాయక్, ప్రభాకర్, బాలాజీ నాయక్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

● తనకల్లు: మండల పరిధిలోని ఈతోడు గ్రామంలో అధికారులు శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ రామానాయక్, టీడీపీ నాయకులు సోంపాలె నాగభూషణం, సర్పంచ్ నాగేంద్రబాబు, హెచ్‌ఎం తిరుపాల్ నాయక్, హరిప్రసాద్, ఏఓ భారతి, ఏపీఎం జయంతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం కార్యకర్తలకు ఓ వరం

● బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేసిన శ్రీరామ్



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారికి, బీమా సదుపాయం కల్పించడం బాధిత కుటుంబాలకు ఓ వరంలా నిలుస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. ఇటీవల మండలంలోని పోతుకుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుజ్జల ఆదినరసింహులు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. అతడికి టీడీపీ సభ్యత్వం ఉండటంతో పరిటాలశ్రీరామ్ చొరవతో పార్టీ కార్యాలయం నుంచి ప్రమాద బీమా రూ.5లక్షలు మంజూరైంది. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం మృతుడి భార్య లక్ష్మికి రూ.5లక్షల చెక్కును పరిటాల శ్రీరామ్ అందజేశారు. దీంతో ఆమె సీఎం చంద్రబాబు, నారా లోకేక్, పరిటాలశ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు తలారి వెంకటలక్ష్మి, గ్రామకమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి, నాయకులు రవి, ఐటీడీపీ రాము, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసాగా రాష్ట్ర ప్రభుత్వం

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా ఉందని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేది టీడీపీ మాత్రమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ధర్మవరం నియోజకవర్గంలోని 25 మంది లబ్ధిదారులకు రూ.22.41లక్షల చెక్కులను పరిటాల శ్రీరామ్ పంపిణీచేశారు. టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లి షరీఫ్, బీరే శీన పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

కొత్తచెరువు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ పుట్టపర్తి జోన్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్ చంద్ర తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి జోన్ అధ్యక్షుడిగా రాంప్రసాద్, ప్రధానకార్యదర్శిగా రాజశేఖర్, కొత్తచెరువు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చంద్రశేఖర్, అక్కులప్పను, బుక్కపట్నం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గా మల్లికార్జున, శ్రీనివాసులను ఎంపిక చేశారు. అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడు తూ... ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. పెండింగ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్ర మంలో ఏపీటీఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షుడు పీవీ మాధవ, నాయకులు కిలారి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన

ముదిగుబ్బ, అక్టోబరు, 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జొన్నల కొత్తపల్లి సచివాలయంలో శనివారం సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య పాల్గొని రైతులకు జీవ ఎరువుల ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం జొన్నలకొత్తపల్లి సమీపంలో వేరుశనగ పంటను పరిశీలించి, రైతులకు సూచనలను ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి రవీంద్ర, విస్తరణాధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆముదం పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

నల్లచెరువు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు కృష్ణమూర్తి సాగుచేసిన ఆముదం పంటను శనివారం అనంతపురం జిల్లా రేకుల కుంట ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు రాధాకుమారి, డాక్టర్ విజయ్‌శంకర్‌బాబు పరిశీలించారు. అతియా ఫార్మర్ కంపెనీ ఆధ్వర్యంలో ఆ రైతు మూడెకరాలలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసి న ఆముదం పంట సంతృప్తిగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. మొ క్కకు మొక్కకు మధ్య దూరం కొంచెం ఎక్కువగా పెట్టుకోవడం వల్ల పంట బాగుందని తెలిపారు. ఆ రైతుకు మందులను ఉచితంగా అంద జేశారు. అతియాఫార్మర్ అధ్యక్షుడు వెంకటేష్, సీసీఓ బాలకృష్ణారెడ్డి, ఎంసీఓ శ్రీనివాసులు, నాగరాజు, నీలకంఠేశ్వర తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకండి



కోలాటం ఆడుతున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయ కుండా బాగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం కళాశాల ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినులు మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బయన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.



కొలువు కలకళ!

పేదింటి బిడ్డలకు ప్రభుత్వ ఉద్యోగాలు ..
కష్టేఫలికి నిదర్శనంగా నిలిచిన యువత

నల్లమాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం.. సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాల కల. దాన్ని సాకారం చేసుకునేందుకు అనేక మంది యువత నిత్యం శ్రమిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే ఉద్యోగ భద్రతతో పాటు సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం దక్కుతాయి. ఇటీవల మండలంలోని పలువురు కానిస్టేబుల్, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. ప్రయత్నలోపం లేకుండా శ్రమిస్తే విజయం వరిస్తుందనేందుకు వీరు ఉదాహరణగా నిలిచారు. మండలంలో కుటాలపల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటేష్ నాయక్, చెన్నకేశవనాయక్, దొన్నికోట గ్రామానికి చెందిన రియాజ్‌ఖాన్, పులగంపల్లి గ్రామానికి చెందిన ఆసీఫ్‌బాషా, మనకవంకపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ, నేరాలవంకతండాకు చెందిన సంధ్య, బాసంవారిపల్లి గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. అలాగే ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన బసనగాని సుమంత్, కురుమాల గ్రామానికి చెందిన కొండె జ్యోత్స్న, పుల్లగూర్లపల్లికి చెందిన గంగప్ప ఉపాధ్యాయ కొలువులు సాధించారు. పేదరికానికి ఎదురొడ్డి నిలిచి, అచెంచల దీక్షతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విజయగాథ వారి మాటల్లోనే...

గొర్రెలు కాసి చదివించారు

మా నాన్న చంద్రానాయక్, అమ్మ లక్ష్మీదేవి. వీరు సేద్యపు పనులతో పాటు గొర్రెలు కాస్తూ నన్ను చదివించారు. మాకు రెండెకరాల పొలం ఉంది. ఆ పొలం పనులు అమ్మ చూసుకుంటుండగా నాన్న గొర్రెలు మేపేవాడు. వారి కష్టాన్ని చూసి బాగా చదివి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని చిన్నప్పుడే నిశ్చయించుకున్నా. 1 నుంచి ఏడో తరగతి వరకు మా ఊర్లోనే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. 8 నుంచి పదో తరగతి వరకు నల్లమాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివా. ఇంటర్ కూడా నల్లమాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే పూర్తి చేశా. అప్పట్లో క్రీడా పోటీల్లో బాగా ఆడేవాడిని. ఆ ఆటలు నేను పోలీస్ ఉద్యోగం సాధనలో ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఫిజికల్ ఫిట్నెస్ క్రీడల వల్లే సాధ్యమైంది. మంచిగా విధులు నిర్వహించి, నా తల్లిదండ్రులకు మంచి పేరు తెస్తా.



- చిన్న వెంకటేష్‌నాయక్, కుటాలపల్లి తండా

వలస వెళ్లి సాకారు



మాది నిరుపేద కుటుంబం. నన్ను చదివించి ప్రయోజకులను చేయడానికి మా నాన్న కృష్ణమూర్తి, అమ్మ రామకృష్ణమ్మ అహోరాత్రులు శ్రమించారు. ఇందుకోసం వారు 13ఏళ్ల బెంగళూరుకు వలస వెళ్లి, అక్కడ గార్మెంట్స్ పని చేశారు. వచ్చిన సంపాదనతో నన్ను చదివించారు. పాఠశాల నుంచి ఇంటర్ వరకు నా విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ విద్యాలయాల్లోనే సాగింది. టీటీసీ రాయచోటి, బీఈడీ కర్నూలులో కన్వీనర్ కోటాలో పూర్తి చేశా. 2018లో డీఎస్సీ రాసినా రాలేదు. చాలా నిరుత్సాహం కలిగింది. అయితే అమ్మానాన్నల కష్టాన్ని తలచుకుని ఎంత కష్టమైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని ప్రయత్నించా. పగలు రాత్రి అదే ధ్యాసతో గడిపా. ఈక్రమంలోనే డీఎస్సీ-2025లో మెరుగైన ర్యాంకు రావడంతో సోషియల్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యా. నాకు ఉద్యోగం వచ్చిన విషయం తెలియగానే నా తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ప్రస్తుతం పుట్టపర్తి మండలం పెడబల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా.

- బసనగాని సుమంత్, స్కూల్ అసిస్టెంట్, ఎర్రవంకపల్లి

అక్కా బావ ప్రోత్సాహంతో..



మా అక్క, బావ ప్రోత్సాహంతోనే నేను కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. నాన్న జయరాం నాయక్, అమ్మ శాంతమ్మ. మాకున్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేస్తూ మమ్మల్ని పెంచి, చదువు చెప్పించారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మా ఊర్లోనే ప్రభుత్వ బడిలో చదివా. 8 నుంచి పదో తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదువుకున్నా. ఇంటర్, డిగ్రీ అనంతపురం ప్రభుత్వ కళాశాలలో చదివా. చదువు గురించి, ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే వచ్చే మర్యాద గురించి తరచూ మా అక్క, బావ చెప్పేవారు. వారి ప్రోత్సాహంతోనే కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రయత్నాలు ప్రారంభించా. ఈక్రమంలోనే కాకినాడ శ్యామ్ ఇన్స్టిట్యూట్‌లో ఆరు నెలలు పాటు కోచింగ్ తీసుకున్నా. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లోనే ఈవెంట్స్‌తో పాటు ప్రిలిమ్స్ పూర్తి చేశా. అయితే ఎంపికైన వారందరికి ఉద్యోగాలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అప్పట్లో దరఖాస్తు చేసుకున్నవారందరికీ రెండుసార్లు పరీక్షలు నిర్వహించి మెరిట్ సాధించిన వారిని పోలీసు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈక్రమంలో నాకు కూడా ఉద్యోగం వచ్చింది.

- చెన్నకేశవనాయక్, కుటాలపల్లి తండా

నా భర్తే గురువు...



నా ఉద్యోగ సాధనలో నా భర్త కొండో భానుప్రకాష్‌రెడ్డి గురువుగా నిలిచాడు. నాకు వివాహం అయిన తర్వాత చదువు విలువ తెలియజెప్పి బాగా చదవాలని ప్రోత్సహించేవారు. ఆయన ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. నాకు తెలియని సబ్జెక్ట్ విషయాలు ఎన్నో వివరించేవారు. ఈక్రమంలో 2018లో డీఎస్సీ రాసినా ఫలితం లేకపోయింది. అయితే నేను కుంగిపోకుండా నా భర్త అండగా నిలిచాడు. దీంతో మరింత పట్టుదల చదివి 2025లో ఎస్జీటీగా ఉద్యోగం సాధించా. ప్రస్తుతం అమడగూరు మండలం చినగానిపల్లి పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నా. - కొండె జ్యోత్స్న, కురుమాల

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య



సుదర్శన్ (ఫైల్)

గార్లదిన్నె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. మండలంలోని ఇల్లూరు గ్రామానికి చెందిన కురువ సుదర్శన్ (28) అనే కౌలు రైతు శనివారం మృతి చెందాడు. ఇల్లూరు గ్రామానికి చెందిన కురువ సుదర్శన్, మమత దంపతులు ఉన్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. గత మూడేళ్ల నుంచి పంట దిగుబడి రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. పంట సాగుకోసం తెలిసిన వారివద్ద అప్పులు చేశాడు. దిగుబడి రాకపోవడంతో పాటు అంతోఇంతో పండిన పంటకు గిట్టుబాటు ధర రాలేదు. పంట సాగుకోసం చేసిన అప్పులు అధికమయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలని దంపతులిద్దరు తరుచు బాధపడుతుండేవారు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది సుదర్శన్ శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చదువుపట్ల ఆసక్తిలేక విద్యార్థి..



మనోజ్‌కుమార్ (ఫైల్)

మడకశిర రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని దిగువ ఈచలేడి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి మనోజ్‌కుమార్ (15) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ ముత్యాలప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. మనోజ్‌కుమార్ బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదిస్తున్నారు. మనోజ్‌కుమార్‌కు చదువు పట్ల ఆసక్తి లేదని తెలిపారు. పాఠశాలకు వెళ్లలేక మనస్థాపం చెంది ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. విద్యార్థి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

కనగానపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యలక్కుంట్ల పెద్దమ్మస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద పెద్దమ్మస్వామి ఆలయం ఉంది. అర్ధరాత్రి వేళ ఆలయంలో చొరబడిన దొంగలు అమ్మవారి వెండి ఆభరణాలతో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయానికి వెళ్లిన పూజారులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. అనంతరం గ్రామస్థులు గ్రామ శివారులో దుండగులు ధ్వంసం చేసిన హుండీని పరిశీలించారు. వెండి ఆభరణాలు, నగదు మొత్తం కలిపి రూ.2 లక్షలు విలువ ఉంటుందని గ్రామస్థులు పోలీసులకు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'ట్రంప్ సుంకాల యుద్ధం' ఆవిష్కరణ



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత దేశంపై ట్రంప్ సుంకాల యుద్ధం బుక్‌లెట్‌ను సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ ట్రంప్ టారిఫ్ టెర్రరిజం, మోదీ లొంగుబాటుకు వ్యతిరేకంగా సీపీఎం దేశవ్యాప్త నిరసనలకు పిలుపు ఇచ్చిందన్నారు. అందులో భాగంగానే జిల్లా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పార్టీ కేంద్ర కమిటీ ముద్రించిన బుక్‌లెట్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలు, వజ్రాలు, మందులు, వస్త్రాలు, ఫార్మా ఉత్పత్తులు, ఆఖరుకు సినిమాలపైనా పన్నులు వేస్తున్నారన్నారు. దీంతో ఆయా పరిశ్రమలపై ఆధార పడిన అనేక మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. కాగా అమెరికా నుంచి భారత దేశానికి పన్నులు లేకుండా డైరీ, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి చేస్తోందన్నారు. అదే జరిగితే మన వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వీసాల ఆంక్షలతో ఎన్ఆర్ఐ ఉద్యోగులు, విద్యార్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. ఈ స్థితిలో భారత దేశ యువత భవిష్యత్తును కాపాడాల్సిన మోదీ ప్రభుత్వం చేష్టలుడికి వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఈ అంశంపై తమ అభిప్రాయం వ్యక్తపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై ఉక్కుపాదం: ఎస్పీ

వేర్వేరుచోట్ల రూ. 19.39 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లోని ఇళ్లు, ఆలయాలు, రైతుల పొలాల్లో చోరీలకు పాల్పడిన దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో పుట్టపర్తి, కదిరి డీఎస్పీలు విజయ్‌కుమార్, శివన్నారాయణస్వామితో కలసి ఎస్పీ కేసుల వివరాలు వెల్లడించారు. పుట్టపర్తి, బ్రాహ్మణపల్లి, గోరంట్ల, సోమందేపల్లి, కియా, రొద్దం ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న నరసింహమూర్తిని అరెస్ట్ చేసి.. రూ. 12లక్షల విలువచేసే 100 గ్రాముల బంగారం, సెల్‌ఫోన్, మారుతి కారును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నల్లమాడ, ఓడీసీ, అమడగూరు, బుక్కపట్నం, పుట్టపర్తి, తలుపుల, గాండ్లపెంట, కదిరి, రామగిరి మండలాల పరిధిలో పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి అల్యూమినియం, వైర్లు దొంగలించిన.. నల్లమాడకు చెందిన మునిమడుగు రంగనాథ్, వెంకటేష్, బుక్కపట్నంకు చెందిన కుంచెపు గణేష్, ఎన్పీకుంటకు చెందిన వెంకటరమణప్ప, మహమ్మద్‌రఫీ, సోమందేపల్లికి చెందిన సాదిక్‌ఖాన్‌ను అరెస్టు చేసి 657 కిలోల అల్యూమినియం వైరు, రూ. 5.07 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడిన కోలార్ జిల్లాకు చెందిన కావడి శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లాకు చెందిన బండి సోమశేఖర్, మెనపడి రమేష్, కర్ణాటకకు చెందిన కొండాచారిని అరెస్టు చేసి రూ. 2.16 లక్షల నగదు, వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నల్లమాడ మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ఆచూకీ తెలిపిన దంపతులను ఎస్పీ సన్మానించారు. దొంగల ముఠాలను అరెస్టు చేయడంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, కదిరి డీఎస్పీ శివన్నారాయణ ఆధ్వర్యంలో చొరవ చూపిన పుట్టపర్తి సీఐ శివాంజనేయులు, నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఓడీసీ ఎస్ఐ మల్లికార్జున, గాండ్లపెంట ఎస్ఐ రవికుమార్, అమడగూరు ఎస్ఐ ప్రదీప్ ఎరాజు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సతీష్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

జర్నలిజంలో విశ్వసనీయత ముఖ్యం

ప్రభుత్వ విప్ కాలవ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు వృత్తిలో విశ్వసనీయత ముఖ్యమని, నిరంతరం శ్రమించడం వల్లనే అది సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన గ్రామీణ విలేకరుల పునశ్చరణ తరగతులు శనివారం ముగిశాయి. ఏపీయూడబ్ల్యుజే నిర్వహించిన తరగతుల్లో శిక్షణ పొందిన జర్నలిస్టులకు అకాడమీ నుంచి పత్రాలను అందించారు. క్రైమ్ రిపోర్టింగ్‌పై ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ శ్రీశైలం రమేష్, పత్రికా భాషపై సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ, కృత్రిమ మేధపై సీనియర్ జర్నలిస్టు కుర్రా విజయకుమార్ శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కాలవ మాట్లాడుతూ.. నిబద్ధత, చిత్తశుద్ధితో జర్నలిస్టులు వృత్తికి వన్నె తేవాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు పాత్రికేయుడు అవుతున్న నేటి ఆధునిక యుగంలో సామాజిక అంశాలను కొత్తగా రాయాలని సూచించారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ మాట్లాడుతూ.. రెండురోజుల పాటు జరిగిన పునశ్చరణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను విలేకరులు ఆచరణలో పెట్టాలని సూచించారు. ప్రతి విలేకరి నైతిక విలువలు పాటించాలని తెలిపారు. ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో కోత పెట్టిందని, ఈ ప్రభుత్వంలో అర్హులకు న్యాయం చేయాలని కోరారు. హెల్త్‌స్కీం, ఇంటి స్థలాలు వంటి సంక్షేమ కార్యక్రమాలకు అక్రిడిటేషన్ల అవసరం ఉందని తెలిపారు. విశ్రాంత జర్నలిస్టులకు పెన్షన్ స్కీం విషయంలో అండగా ఉండాలని విప్‌ను కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండప్ప, జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ అయూఫ్ పాల్గొన్నారు.

విశాఖకు గూగుల్.. హర్షణీయం

మంత్రి లోకేశ్ చొరవకు అభినందనలు
సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్



మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో అత్యంత గుర్తింపు పొందిన గూగుల్ సంస్థ విశాఖపట్నంకు రావడం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేవరగుడి జగదీష్ పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గూగుల్ సంస్థను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడాన్ని సీపీఐ స్వాగతిస్తోందని అన్నారు. గూగుల్‌ను విశాఖకు తీసుకురావడానికి చొరవచూపిన మంత్రి నారా లోకేశ్‌ను అభినందిస్తున్నామని తెలిపారు. తమ పార్టీ ప్రతిపక్షంలో ఉంటూ పోరాటాలు చేస్తున్నా.. రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మంచి పనులను ఎపుడూ స్వాగతిస్తుందని అన్నారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయడం వల్ల ఇతర ప్రముఖ సంస్థలు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతాయని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కర్నూలులో హైకోర్టు బెంచ్, అనంతలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జీఎస్టీపై ప్రధాని నరేంద్రమోదీ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి, ప్రజల్లో వ్యతిరేకత రావడంతో కొంత తగ్గించి గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మరో రాష్ట్రనేత జాఫర్ మాట్లాడుతూ.. జీఎస్టీ ప్రచారానికి కోట్లు ప్రజాధనం ఖర్చుపెడుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రచారం చేసేటపుడు పెట్రోల్, డీజిల్ ధరలకు జీఎస్టీ ఎందుకు వర్తింపచేయలేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, శ్రీరాములు, రమణయ్య, రామక్రిష్ణ పద్మావతి, అల్లీపీరా తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరిగా రూ.10 వేలు పలికాయన్నారు.

టమోటా కిలో రూ. 21

అనంతపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.21తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.12, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1875 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

పండుగకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంతకల్లు డివిజన్ మీదుగా సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (06303)ను ఈ నెల 18న, కలబురగి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (06204)ను ఈ నెల 20న నడపనున్నట్లు తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (06307) ఈ నెల 20న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06208) ఈ నెల 21న నడుపుతామన్నారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి ప్రత్యేక రైలు (0630) ఈ నెల 21న, కలబురగి-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (06210) ఈ నెల 22న నడపనున్నట్లు వివరించారు. ఈ రైళ్లు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు. యశ్వంతపూర్-ముజఫ్ఫర్ నగర్ ప్రత్యేక రైలు (06261) ఈ నెల 22న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06262)ను ఈ నెల 24న నడుస్తాయన్నారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, డోన్, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట, రామగుండం, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, సట్నా, ప్రయాగరాజ్ చౌకీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బక్సర్, ఔర, దానాపూర్, పాటలీపుత్ర, సోన్‌పూర్, హాజీపూర్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

సోలార్‌తో ఆదాయం : మంత్రి సవిత



ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌తో ఆదాయం వస్తుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. శనివారం సోలార్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డెమో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ బిగించుకోవాలని తెలిపారు. సోలార్ వినియోగంతో ఎలాంటి విద్యుత్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని, మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా వినియోగదారులకు ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ రామక్రిష్ణప్ప, నాయకులు శ్రీరాములు, గోపాల్, పోతిరెడ్డి, రామక్రిష్ణ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, కృష్ణమూర్తి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది అధికారికంగా ధన్వంతరి జయంతి : మంత్రి

వచ్చే ఏడాది నుంచి ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం స్థానిక అన్నాక్యాంటీన్‌లో నాయిబ్రాహ్మణుల ఆరాధ్య దైవమైన ధన్వంతరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

హాకీ, బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్ హాకీ బాలికల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్-14, 17 హాకీ, బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బాస్కెట్‌బాల్, ఆర్డీటీ స్టేడియంలో హాకీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు.

హాకీ అండర్-17 బాలుర జట్టుకు సంతోష్, సాదిక్, కుమార్, బాలరాజు, వెంకటేష్, నవదీప్, విక్రాంత్, ఉదయ్‌కుమార్, మనోజ్, మేఘనాథ్, పోతులయ్య, భీమా, సాత్విక్, గోవర్ధన్, అశోక్, బాలాజీ, జగదీష్, షాదిక్‌వలీ, రిహాన్ ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు మిరాంబీ, జ్యోతి, దివ్య, నవ్యశ్రీ, శ్రీవల్లి, లాస్యరెడ్డి, ప్రేమలత, మోక్షిత, నందిని, కీర్తన, యశస్విని, ఉషశ్రీ, అనురాధా, దీపిక, స్వాతి, జగదీశ్వరి, సమీరా, మల్లికలు ఎంపికయ్యారు.

హాకీ అండర్-14 బాలుర జట్టుకు వరుణ్, లక్ష్మీనారాయణ, శివశంకర్, సునీల్, ఉదయ్‌కుమార్, బాబాఫరీద్, అభినాష్, మణికుమార్, రాజు, మనోజ్, సాదిక్, జయంత్, పవన్, విక్కీ, అజయ్, నవీన్, రవితేజ, మురళీ, భార్గవ్ ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు సనా, గుణశ్రీ, శ్రీరూనికా, శ్రీలేఖ, ఇందు, అర్చన, మాన్య, ప్రియాంక, నాగమణి, మానస, హేమ, హిమబిందు, కావ్యశ్రీ, వర్షిణి, మోక్షిత, భానుశ్రీ, స్వాతి, నందలక్ష్మి ఎంపికయ్యారు.

బాస్కెట్‌బాల్ అండర్-17 బాలుర జట్టుకు సాయిసాత్విక్ వర్ధన్, కౌశిక్, లచ్చి, యశ్వంత్, కార్తీక్ నాయక్, సంతోష్, మనీష్, ఉజ్జనేశ్వర్, యేసుర్, భరత్‌సింహా రెడ్డి, హేమంత్, నవీన్‌కుమార్ రెడ్డి ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు ధన్వి, శ్రావ్య, వాణిశ్రీ, మన్విత, శరణ్య, శ్రావణి, వర్షిణి, సంధ్యా, మహిత, రచన, జయలక్ష్మీ, ఓంశ్రీజోష్ణ ఎంపికయ్యారు.

అండర్-14 బాలుర జట్టుకు యోగేశ్వర్, మిథిల్‌సత్య, షణ్ముఖ, గౌతమ్, అభిజ్ఞారామ్, రాఘవ్, వరుణ్యకుమార్ రెడ్డి, ప్రశాంత్, భావిష్‌రెడ్డి, తరుణ్, రాజు, హితేష్‌చౌదరి ఎంపికయ్యారు.

బాలికల జట్టుకు హర్షిత, సిద్రహా, పూజిత, అమృత, ప్రియదీప్తి, కారుణ్య, ఆరీనా, భావన, పల్లవి, అఫ్రీనా, ప్రజ్వల, సోనాక్షి ఎంపికయ్యారు. వీరంతా ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సభ్యులు తెలిపారు.

ఈ బురదను దాటేదెలా..?



బీసీ, ఎస్సీ బాలుర వసతిగృహం ముందు ఉన్న బురద

పరిగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలుర హాస్టల్‌లో దాదాపు 150మంది చదువుకుంటున్నారు. వర్షం వచ్చినా రాకపోయినా హాస్టల్ ముందు బురదమాత్రం ఉంటుంది. దీనిని దాటి విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి పీట్లు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. హాస్టల్‌కు ఆమడదూరంలోనే సచివాలయం ఉంది. అందులో పారిశుధ్య కార్మికులు, అధికారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. విద్యార్థుల పాట్లుచూసి కూడా పట్టించుకోకోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

రహదారి గుంతలమయం



గుంతలమయమైన రోడ్డులో నిలిచిన నీరు

లేపాక్షి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కంచిసముద్రం గ్రామంలో రహదారి గుంతలమయంగా మారింది. తరచూ ఇక్కడ తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరంతా రోడ్డుపైనే నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కనున్న ఇళ్లలో ఈనీరు చేరుతుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా స్పందించలేదని అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారిని బాగుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

సోమందేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కేజీబీవీలో విద్యార్థినులకు గుడ్, బ్యాడ్‌టచ్‌లపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్ఐ రమేష్ బృందం పాఠశాల విద్యార్థినులకు భద్రత అంశాలను వివరించారు. అనంతరం డయల్ 100, శక్తి యాప్, బాల్య వివాహాల నిషేధం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో సోలార్ ఆధారిత సీసీటీవీ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో ఎస్ఓ అనిత పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

పావగడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గురుభవనం నుండి శనిమహాత్మ సర్కిల్ వరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు శనివారం ర్యాలీ నిర్వహించారు. శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. తాలూకా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

'విగ్రహావిష్కరణకు తరలిరండి'



ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండల కేంద్రంలో ఈనెల 26న వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ జరగనుందని, వడ్డెర్లు తరలి రావాలని నాయకులు రామాంజి పిలుపునిచ్చారు. శనివారం సోమందేపల్లిలోని సప్తగిరి కాలనీలోని వడ్డెర్లను కలిసి ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ సూరీ, శివప్ప, వెంకటేశ్, ఆనంద్, నాగరాజు, చంద్ర పాల్గొన్నారు.

'లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చర్యలు'

గుడిబండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో లైసెన్సు లేకుండా టపాసులు విక్రయిస్తే అలాంటివారిపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రాజకుల్లాయప్ప హెచ్చరించారు. మండలంలో లైసెన్సులు కలిగి టపాసులను విక్రయించాలన్నారు. లైసెన్సులు లేకుండా టపాసులు నిల్వ చేయడం, విక్రయించడం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారస్థులు ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఉండాలని సూచించారు.

టార్పాలిన్ పంపిణీ

సోమందేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయంలో శనివారం రైతులకు తక్కువ ధరలకు టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎఫ్‌పీఓ కార్యాలయం తరుపున వీటిని అందజేసినట్లు ఏపీఎం మదన్ మోహన్ తెలిపారు. రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, మాజీ ఎంపీటీసీలు, బాబయ్య, కిష్టప్ప, ఎఫ్‌పీఓ అధ్యక్షులు నరసన్న, ఎంపీడీఓ వెంకటలక్ష్మీ సిబ్బంది పాల్గొన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

అగళి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 22న మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ రాంప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30కు సమావేశం ఉంటుందన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు అన్నిశాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం

రొద్దం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చోళేమర్రిలో జీఎస్టీ తగ్గింపుపై టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంకుమార్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, టైలర్ ఆంజనేయులు, చంద్రమౌళి, మండల కన్వీనర్ నరహరి, శ్రీనాథ్‌చౌదరి పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

పరిగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీలోని పనిచేస్తున్న 30మంది పారిశుధ్య కార్మికులకు శనివారం బీజేపీ నాయకుడు బంగారచంద్ర నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతలో కార్మికుల పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాబుప్రసాద్, జనసేన నాయకులు నారాయణస్వామి, సాయి, నరసింహ, విగ్నేష్, సుశాంత్, అమర్, సాయినందన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



కబ్జాచేసేందుకు యత్నించిన భూమి ఇదే..

పరిగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న నిజాం షుగర్ ఫ్యాక్టరీ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారు. ఫ్యాక్టరీకి కేటాయించిన 368-2, 368-4సర్వేనంబర్లలోని 3.65 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంతమంది ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం రాత్రి, శనివారం రాళ్లను పాతారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని పాతిన రాళ్లను తొలగించారు. ఈ విషయంపై తహసీల్దార్ హసీనాసుల్తానాను వివరణ కోరగా కొంతకాలంగా ప్రణాళిక ప్రకారం కొందరు ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న మాట నిజమేనన్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లగా ఆక్రమణదారులు పరారయ్యారని తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఇప్పటిదాకా ఇంటిస్థలాలు లేక ఇబ్బందిపడుతున్న పేదలను ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదంటూ హెచ్చరించారు.

పల్లెబాటతో సమస్యలకు పరిష్కారం

టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు

చిలమత్తూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పల్లెబాటతో సమస్యలు పరిష్కారమవుతున్నాయని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. పల్లెబాటలో వినతులను పరిశీలించి వాటికి వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. శనివారం ఆయన పల్లెబాటలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. మొరసనపల్లి పంచాయతీలోని మాదిరెడ్డిపల్లికి ఎన్నో రోజులుగా రోడ్డు సమస్య ఉండేదని, ఆ విషయాన్ని పల్లెబాటలో భాగంగా ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అధికారులతో మాట్లాడి ఆ గ్రామానికి రోడ్డు వేయించడం జరిగిందన్నారు. కాపు చెన్నంపల్లిలోని తాగునీటి సమస్యను పల్లెబాట ద్వారా ప్రజలు తీసుకురాగా శనివారం టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణయాదవ్‌తో కలిసి ఉన్న బోరుబావిని శుభ్రం చేయించామన్నారు. కొత్త మోటారు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించామన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు అవసరమైన పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకంటున్నామన్నారు. పల్లెబాటలో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, అయితే అత్యవసరమైన సమస్యలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని వివరించారు.

'సర్వేచేసి హద్దులు నిర్ణయించండి'



డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

సోమందేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగేచెరువు గ్రామ పంచాయతీకి చెందిన రైతులు సర్వేనంబరు 164లో ఉన్న 18.85ఎకరాలు గత 60ఏళ్లుగా సాగులో ఉన్నామని తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రెడ్డిశేఖర్‌ను కలిసి సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని వినతిపత్రాన్ని అందించారు. అనంతరం మాట్లాడుతూ 12మంది అనుభవంలో ఉండగా ఇటీవల కొందరు తాము ఆ భూమికి సంబంధించి అనుభవంలో ఉన్నామని అర్జీలు సమర్పించారన్నారు. విచారణ జరిపి సాగులో ఉన్నవారికి న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరి జయంతిని నిర్వహిస్తున్న నాయకులు

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ధన్వంతరి జయంతిని నాయీబ్రాహ్మణులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రమేష్ హాజరై ధన్వంతరి గురించి వివరించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు మూర్తి, నాగేంద్ర, శ్రీనివాసులు, రమేష్, మంజునాథ్, టీడీపీ నాయకులు రమణ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి



నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి/పెనుకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాజీనగర్‌లో శనివారం పాముకాటుతో నాగలక్ష్మమ్మ (48) మృతిచెందింది. బ్రాహ్మణపల్లికు చెందిన ఈమె సోమందేపల్లిలో ఉంటున్న కుమార్తె మీనాక్షి ఇంటికి వచ్చింది. పశువులకు మేత వేసేందుకు వెళ్లగా పాముకాటుకు గురైంది. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు తెలిపారు. కాగా నాగలక్ష్మమ్మ టీడీపీ కార్యకర్త. నాగలక్ష్మమ్మ మృతి చెందిందన్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి సవిత, టీడీపీ నాయకులు ఆమెకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియల కోసం ఆర్థికసాయాన్ని అందించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి శైలజ



ర్యాలీలో పాల్గొన్న అదనపు న్యాయమూర్తి, సిబ్బంది

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. శనివారం రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్రవాహనాలు, కార్లు లేకుండా న్యాయమూర్తులు న్యాయస్థానాల సిబ్బంది విధులకు హాజరయ్యే విధానాన్ని పరిశీలించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ కాలుష్య రహిత సమాజం వల్ల ఏర్పడే ప్రయోజనాలను వివరించారు. ఒక్కరోజు వాహనాలు లేకుండా నడవడంతో ఇంధనం ఆదాచేయడంతోపాటు ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికార కార్యాలయ అధికారి సుధాకర్, సూపరింటెండెంట్ ఉమాదేవి, న్యాయవాది రాజశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 24న నిర్వహిస్తున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని ఎరుకుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కొంతమంది నకిలీ ఎరుకుల ధృవపత్రాలు పొంది లబ్ధిపొందుతున్నారన్నారు. దీంతో నిజమైన వారికి అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, వెంకటేశ్, వెంకటరమణ, మనోజ్, హనుమంతు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు నవంబరు 3 నుంచి చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కమిషనర్‌కు నోటీసును అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వినోద్, నరేష్, వరదరాజులు, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, మంజుళ పాల్గొన్నారు.

'దీపావళి జాగ్రత్తగా జరుపుకోవాలి'

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను అందరూ ఆనందంగా, ఉత్సాహంగా జాగ్రత్తగా చేసుకోవాలని పాంచజన్యపాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులతో కలిసి ముందస్తు దీపావళి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గాయిత్రి, నందకుమార్, ఏఓ భాస్కర్, విజయేంద్ర, శశికళ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా భాష్యం పాఠశాలలో దీపావళి బాణసంచాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామక్రిష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, రవివర్మ పాల్గొన్నారు.

గ్లోబల్‌జెన్ పాఠశాలలో...

పెనుకొండ: ప్రగతి గ్లోబల్‌జెన్ పాఠశాలలో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులతో హాజరై టపాసులు, కాకరవొత్తులతో బాణసంచా పేల్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మంజువాణి పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్‌కు విఫలయత్నం

పరిగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిగెనహళ్లి గ్రామంలో ఇద్దరు యువకులు చైన్‌స్నాచింగ్‌కు యత్నించినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. వృద్ధురాలు సుబ్బలక్ష్మమ్మ కాళ్లనొప్పులతో బాధపడుతోంది. మసాజ్ చేస్తామని హిందూపురం నుంచి ఇద్దరు యువకులు వచ్చారు. కాళ్లకు మసాజ్ చేస్తూ ఆమె మెడలోని గొలుసును కత్తరించగా పసిగట్టిన వృద్ధురాలు గొలుసును పట్టుకుని కేకలు వేసింది. దీంతో వారు పరారయ్యారు. ఎస్ఐ వృద్ధురాలిని సంఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



బోయపేట పాఠశాలలో కాలుష్య నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు



రొద్దంలో స్వచ్ఛాంధ్రపై మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు



గుడిబండలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

● స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రలో అధికారులు, నాయకులు

స్వచ్ఛమైన గాలిని భావితరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రను నిర్వహించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్

పారిశుధ్య నిర్వహణాలోపంతోనే
ఉద్యోగి మృతి

సీపీఎం అనుబంధ సంఘాలు



ఎంపీడీఓకు వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంతలో సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతోనే మార్కెట్ రోడ్డులో ద్విచక్రవాహనం బోల్తాపడి బ్యాంక్ ఉద్యోగి మృతిచెందినట్లు సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు ఆరోపించారు. శనివారం పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు ధర్నా చేశారు. కార్యదర్శిపై చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, తహసీల్దార్ మారుతి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుధ్య నిర్వహణలో లోపం లేకుండా చూసుకుంటామన్నారు. కార్మికుల కొరత ఉందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, నాయకులుగోవిందప్ప, కొండా వెంకటేశు, నాగభూషణ, రవి, కిష్టప్ప పాల్గొన్నారు.

చెత్తను బయట పారేయకండి: ఎంపీడీఓ

సోమందేపల్లి: చెత్తను బయట పారబోయకండి అని ఎంపీడీఓ వెంకటలక్ష్మీ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు నిర్వహించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'సురక్ష' ద్వారా మద్యం విక్రయించాలి

● డీసీ నాగమద్దయ్య



మద్యం దుకాణాలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పెనుకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో ఏపీఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారానే మద్యం బాటిళ్లను స్కాన్‌చేసి విక్రయించాలని ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య దుకాణ యజమానులకు సూచించారు. శనివారం పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్‌లోని మద్యం దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాలలో ఏపీఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిళ్ల స్కాన్‌చేసి విక్రయిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ప్రతి మద్యం బాటిల్‌ను సురక్ష యాప్ ద్వారానే విక్రయించాలని ఆదేశించారు. మద్యం విక్రయదారులకు యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఎలా స్కాన్‌చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనంతపురం ఎన్ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, పెనుకొండ సీఐ సృజన్‌బాబు, ఎస్ఐలు రాజశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరిత దీపావళి



దీపాలు వెలిగిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మడకశిర రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండుమల ఉన్నత పాఠశాలలో హరిత దీపావళిని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కర్, హెచ్ఎం సుకన్య మాట్లాడుతూ పటాసుల వాడకాన్ని తగ్గించి దీపాల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

రొద్దం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన చోళేమర్రి గ్రామ టీడీపీ కార్యకర్త వెంకటేశ్‌ను నాయకులు శనివారం పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్సపొంది గ్రామానికి వచ్చిన ఆయనను నాయకులు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, మండల కన్వీనర్ నరహరి, చిన్నప్పయ్య, చంద్రమౌళి, టైలర్ ఆంజనేయులు, శ్రీనాథ్‌చౌదరి, పవన్‌కుమార్, అశ్వర్థనారాయణ, సర్పంచ్ జనార్దన్, హరి తదితరులు పాల్గొన్నారు.